క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



పొన్నూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం బుధవారం పొన్నూరు పట్టణంలో ప్రారంభమైంది. ఇందిరా కాలనీ 11వ సచివాలయ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- ఆటో రిక్షా ప్రారంభం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతనంగా కొలుగోలు చేసిన ఈ-ఆటో రిక్షా ను బుధవారం వీసీ ఆచార్య పి రాజశేఖర్ ప్రారంభించారు. పూర్తిగా బ్యాటరీతో నడిచే ఈ వాహనం ద్వారా గార్బేజ్ క్లీనింగ్ చేయనున్నారు. సుమారు రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన ఈ వాహనం ద్వారా వేగవంతంగా పనులు చేసే అవకాశం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఓఎస్‌డీ కె.సునీత, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దాలి




గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్‌ఈ విద్యా విధానంలో విద్యార్థులను అన్ని రంగాల్లో సమగ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వేణుగోపాల్‌రెడ్డిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ కలసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య పేరుతో నెలకొల్పిన పాఠశాల ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. కలసిన వారిలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ- డీఎల్‌టీసీల సిబ్బంది అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను ప్రాంతీయ ఉప సంచాలకుడు ఎస్‌వీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ, జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్‌టీసీ)లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమర్తలూరి యోబు, కార్యదర్శి బండి రమేష్‌బాబు, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ సభ్యులు, వివిధ ఐటీఐల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. యూనివర్సిటీలోని ఆరు కళాశాలల విద్యార్థులకు వేర్వేరుగా ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారు. పురుషులకు క్రికెట్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కో-కో, వాలీబాల్, మహిళలకు క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవంలో రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.జాన్సన్ పాల్గొన్నారు. మొదటి రోజు పోటీలలో భాగంగా వీసీ రాజశేఖర్ పురుషుల వాలీబాల్, రిజిస్ట్రార్ కరుణ త్రోబాల్ ఆడి పోటీలు ప్రారంభించారు.

మాట తప్పని, మడమ తిప్పని నేత సీఎం జగన్

- ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు రూ.3వేలకు పెంచారు
- అన్నివర్గాల మేలు కోరే ప్రభుత్వానికి అండగా ఉండాలి
- పెంచిన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పెదకాకానిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.3వేలకు పెంచి అందిస్తున్నారని, సీఎం జగన్ మాట ఇచ్చారంటే చేస్తారంతే అనే ముద్ర ప్రజల్లో ఉందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఫించన్‌లు మంజూరైన 196 మందికి బుధవారం ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య చేతుల మీదుగా రూ.3వేలు చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ప్రజా సంకల్పయాత్రలో 3648 కిలోమీటర్లు నడిచి అన్ని వర్గాల ప్రజల కష్ట సుఖాలను స్వయంగా చూసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్లను దశలవారీగా పెంచడం జరుగుతుందని మేనిఫెస్టోలో ప్రకటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2,250తో ప్రారంభించి 2024 జనవరి నెల నుంచి రూ. 3వేల చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం నేను విన్నాను, నేను ఉన్నాను అంటూ రాష్ట్రాభివృద్ధికి మూలాలను గుర్తించి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అర్హతే ఆధారంగా పార్టీలకు, గ్రూపులకు, వర్గాలకు అతీతంగా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెల 1వ తారీకు ఉదయమే ఇంటికి వచ్చి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారన్నారు. గత ప్రభుత్వంలో కొత్తవారికి ఫించన్ మంజూరు చేయాలంటే ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతేనే వారి స్థానంలో కొత్త ఫించన్ మంజూరు చేసే పరిస్థితి నెలకొని ఉందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సులు, నాయకులు, పచ్చకండువాలు వేసుకుంటేనే పింఛన్ మంజూరు చేసేవారన్నారు. నేడు కేవలం అర్హతే ఆధారంగా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య వివరించారు. ముందుగా పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ఎం.రాజారాం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయ లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మహిళకు పెంచిన పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట రోశయ్య

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బలసాని

గుంటూరు రూరల్: సావిత్రిబాయి పూలే సేవా తత్పరత యావత్ భారత జాతికి మార్గదర్శకమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి, సామాజిక అభ్యున్నతికి విద్యే మార్గమని గుర్తించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు ఆమె అని తెలిపారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని గుర్తించి, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేందుకు ఆమె చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్‌లు, డివిజన్ కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, సొసైటీ డైరెక్టర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

పెదకాకాని: భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల అభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని పెదకాకాని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్తతో కలిసి సత్యశోధన సమాజం స్థాపించి బాల్యవివాహాలు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, సతీసహగమనం రూపు మాపటం, వితంతు పునర్వివాహం కోసం శ్రమించారన్నారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం ఆనందరావు మాట్లాడుతూ 1998లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసిందన్నారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెండు ఇళ్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు



బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బుధవారం మండల తహసీల్దార్ కె.శ్రీకాంత్ కాలిపోయిన ఇళ్లను సందర్శించారు. బాధితులు బండ్లమూడి నల్లారావు, చల్లా శిలువరాజు కుటుంబాలను పరామర్శించి వారికి బియ్యం, దుప్పట్లు, ఇతర వంట సామగ్రిని, రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు సమన్వయంతో పనిచేద్దాం

- పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- రూరల్ మండలం, అర్బన్ డివిజన్ నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేద్దామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో గుంటూరు రూరల్ మండలం, అర్బన్ పరిధిలోని డివిజన్‌లకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలు, డివిజన్‌ల శ్రేణులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. తల్లి కడుపులోని బిడ్డ నుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. చంద్రబాబు అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని గుర్తు చేశారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అతని తొత్తు పార్టీలు అన్ని కలిసి ప్రజలకు కల్లబొల్లి హామీలు ఇస్తున్నారన్నారు. ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. బూత్ కమిటీలనుంచి కార్యకర్త వరకూ ప్రతి ఒక్కరూ జగనన్న చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని కార్యకర్తలు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, పలు డివిజన్‌ల కన్వీనర్లు, సొసైటీ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో బుధవారం జరిగింది. చేబ్రోలు గౌడపాలెం ప్రాంతానికి చెందిన నూతలపాటి నవీన్ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో నవీన్‌కు కాలు విరిగింది. తీవ్ర గాయాలైన నవీన్‌ను 108 వాహనం ద్వారా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల రాయుళ్ల అరెస్ట్


గుంటూరు రూరల్: కోడిపందేల రాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రత్నగిరినగర్ శివారుల్లో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు దాడిచేయగా కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులు వారి వద్దనుంచి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

న్యాయ శాస్త్ర కోర్సుల నూతన భవనానికి శంకుస్థాపన



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ పేరుతో నిర్వహిస్తున్న న్యాయ శాస్త్ర కోర్సులకు నూతన భవన నిర్మాణానికి బుధవారం వీసీ పి.రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ భవనానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నారు. సుమారు రూ.10.94 కోట్ల అంచనాతో ఈ భవనాన్ని సీపీడబ్ల్యూడీ నిర్మించనుంది. శంకుస్థాపన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, పాలకమండలి సభ్యులు సిహెచ్.స్వరూపరాణి, ఆచార్య కె.సుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్, డాక్టర్ షాహేద అక్తర్, వి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ కె.గంగాధర్ రావు, ఎ.ప్రమీలరాణి, ఓఎస్‌డీ కె.సునీత, సీడీసీ డిన్ కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, చీఫ్ ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ



జొన్నలగడ్డలో జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు



పెదపలకలూరులో 10వ తరగతి విద్యార్థులతో కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. బుధవారం జొన్నలగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషిచేయాలన్నారు. గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, వంగా నవీన్‌రెడ్డి, మబ్బు సుధాకర్, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదపలకలూరులో...

ప్రతి విద్యార్థి చదువుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలని జగనన్న విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నాడు నేడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన, మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. బుధవారం పెద్దపలకలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులతో ఆంధ్ర రాష్ట్రాన్ని విద్యాభివృద్ధిలో ముందువరుసలో నిలబెట్టిన ఏకైక నాయకుడు మన జగనన్న అని 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

స్వర్ణభారతినగర్‌లో...

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదివి లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని 41వ డివిజన్ కార్పొరేటర్ బి.స్మితపద్మజ తెలిపారు. బుధవారం స్వర్ణభారతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి

కొమ్మూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న ప్రతి విద్యార్థికి ఉన్నతవిద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యను అందించడంతో పాటు అనేక పథకాలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ముజావర్ షేక్ అసదుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'బజరంగ్' భరోసా

- దివ్యాంగ దర్శిని పేరిట పలు సేవా కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మంచాలలో పలువురికి జైపూరు కాలు అమరిక, ట్రైసైకిళ్ల పంపిణీ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు భరోసా ఇవ్వటం కోసం దివ్యాంగ దర్శిని పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల, సుద్దపల్లి గ్రామాల్లోని దివ్యాంగులకు జైపూర్ కాలు, ట్రై సైకిల్‌ను బుధవారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. మండల పరిధిలోని మంచాల గ్రామానికి చెందిన పంద్రంగి సురేష్‌కు అనారోగ్య కారణాలతో కాలు కొంత భాగం తొలగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన పంద్రంగి సురేష్‌ను అంబటి మురళీకృష్ణ గత నెలలో పరామర్శించి జైపూర్ పాదాలు అందించి అతని కాళ్లమీద నిలబడే విధంగా తోడ్పాటును అందించనున్నట్లు భరోసా నిచ్చారు.. వైద్యుల ద్వారా జైపూర్ కాలును అమర్చటంతో దివ్యాంగుని కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తుమ్మల వెంకట శివయ్యకు ట్రై సైకిల్‌ను అంబటి మురళీకృష్ణ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకొని బజరంగ్ ఫౌండేషన్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, దివ్యాంగ దర్శిని వంటి కార్యక్రమాలను బజరంగ్ ఫౌండేషన్ నిర్విరామంగా కొనసాగిస్తుందన్నారు. ఆయాచోట్ల జరిగిన సేవా కార్యక్రమంలో బజరంగ్ వలంటీర్లు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మంచాలలో కాలు కోల్పోయిన పంద్రంగి సురేష్‌కు జైపూర్ కాలును అమర్చి, భరోసా ఇస్తున్న అంబటి మురళీకృష్ణ

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: నగరంలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె వలన పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, ప్రజారోగ్య రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం ఉదయం నగరంలోని వివిధ డివిజన్లలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఈఈలు, డెప్యూటీ కమిషనర్ల స్థాయిలో నగరంలో శానిటేషన్ పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులకు విధులు కేటాయించామని పేర్కొన్నారు. సమ్మెలో లేని కార్మికులను అన్ని డివిజన్లకు కేటాయించాలని, వెహికల్ షెడ్‌లోని డ్రైవర్లు ప్రధానంగా చెత్త పోగుపడే ప్రాంతాల్లో డంపర్ బిన్ల వద్ద వ్యర్థాలను తరలించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్మిక సంఘ నాయకులు కార్మికులను బలవంతంగా సమ్మెలోకి తీసుకెళ్లవద్దని, విధుల్లో ఉండే కార్మికులను అడ్డుకోవద్దని కోరారు. నగర ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున ప్రజలు తమ ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేయవద్దని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇంటి వద్దకు చెత్త సేకరణ చేయడానికి నగరపాలక సంస్థ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే ప్రజారోగ్యానికి ప్రమాదం కలుగుతుందని నగర ప్రజలు సహకరించాలని కోరారు. డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఓ మధుసూదన్ పాల్గొన్నారు.